సాక్షి తిరుపతి

బుధవారం । 21 । జూన్ । 2023



గంగమ్మకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి పానగల్ గంగ జాతర సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున ముక్కంటి సారె సమర్పించారు. - 8లో



సంక్షేమాన్ని వివరిస్తూ..!

సమస్యల పరిష్కారినికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన గడపగడపకు మహాపాదయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	27
చిత్తూరు	34	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 69,879 మంది స్వామివారిని దర్శించుకోగా.. 29,519 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.82 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లులేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారికి ద్విచక్ర వాహనం బహూకరణ



ద్విచక్ర వాహనాన్ని బహూకరిస్తున్న దాతలు

తిరుమల: తిరుమల శ్రీవారికి మంగళవారం ఉదయం హీరో మోటో కార్ప్ సంస్థ నూతన మోడల్ ప్యాషన్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని బహూకరించింది. ఈ వాహనం ధర రూ.92,921 అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హీరో సంస్థ సౌత్ జోన్ మేనేజర్లు రామురావు, లక్ష్మీషా కలిసి వాహనం పత్రాలను ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పేష్కార్ శ్రీహరి, పోటు పేష్కార్ శ్రీనివాసులు, డిస్ట్రిబ్యూటర్ పృథ్వీ, తిరుమల డీఐ జానకీరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు సైన్స్ సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

తిరుపతి కల్చరల్: జూనియర్ చాబర్ ఇంటర్నేషనల్, తిరుపతి, చిత్తూరు జిల్లా యోగా అసోసియేషన్ సహకారంతో రీజనల్ సైన్స్ సెంటర్‌లో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సైన్స్‌సెంటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాసనెహ్రూ తెలిపారు. ఉదయం 7.30 గంటలకు జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా నిపుణులు యోగా విశిష్టతను వివరిస్తారని, అనంతరం యోగా నిపుణుడు కిరణ్‌కుమార్, యోగా అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి శ్రీనివాసులునాయుడు యోగా ఎలా ప్రారంభించాలి అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.

నాణ్యత ఎక్కడ?



రోడ్డు నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు


బాలాయపల్లి (తిరుపతి అర్బన్): వెంకటగిరి ఎన్‌హెచ్ 5 నుంచి గూడూరు రూరల్ తిప్పవారుపాడు వరకు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనుల్లో నాణ్యత లేమిని రోడ్డు భవనాల శాఖ క్వాలిటీ కంట్రోల్ అధికారి సీఈ.పిసి రమేష్ తేటతెల్లం చేశారు. మంగళవారం బాలాయపల్లి మండలం, నిండలి గ్రామ సమీపం వద్ద జరిగిన రోడ్డు పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి పట్టణం బంగారుపేట కూడలి నుంచి తిప్పవారుపాడు వరకు రూ.40 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయని, ఆ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే వేటు తప్పదని హెచ్చరించారు. నాణ్యత లేకపోతే ఎటువంటి బిల్లులు చెల్లించమని తేల్చిచెప్పారు. రోడ్డు భవనాలశాఖ ఎస్‌ఈ శివకుమార్, ఎస్‌ఈ గంగాధరం, ఈఈ రామాంజనేయులు, ఈఈ గీతాంజలి, డీఈ మధుసూదన్, ఏఈ వాసు ఉన్నారు.

రేపు ఉద్యోగ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం, మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు అలిపిరి రోడ్డులోని సెట్విన్ కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ డెప్యుటీ చీఫ్ శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో అపోలో ఫార్మసీ, ఎస్‌బీబీ మెడికేర్, సాయి సంగీత ఎలక్ట్రికల్స్ సంస్థల ప్రతినిధులు హాజరై ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ, డీ-ఫార్మసీ, బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, డీఈఈ డిప్లొమో, ఎంబీఏ విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరవ్వాలని, పూర్తి వివరాలకు 7989810194, 0877-2248231 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

■ తిరుత్తణికి చెందిన జమునను తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవం కోసం మార్చి 26వ తేదీన అడ్మిట్ చేశారు. ఆమె కుటుంబసభ్యులు మంచి ముహూర్తంలో డెలివరీ చేయించాలని భావించారు. ఓ పండితుడి సూచన మేరకు ఏప్రిల్ 9వ తేదీలోపు కాన్పు చేయించాలని నిర్ణయించారు. అనుకున్న విధంగానే మార్చి 31వ తేదీ ఉదయం 5.30 గంటలకు సిజేరియన్ చేయించేశారు. ఇందుకోసం నిర్ణీత రుసుముతో పాటు ఆపరేషన్‌కు అదనంగా రూ.30 వేలు చెల్లించుకోవాల్సి వచ్చింది.

■ జీడీనెల్లూరుకు చెందిన కవిత ప్రసవం కోసం చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. ఆమె కుటుంబీకులు మేలో కత్తెర ప్రారంభమవుతుందని, ముందుగానే డెలివరీకి తేదీ ఫిక్స్ చేయించారు. మరో 6 రోజుల్లో సుఖ ప్రసవం జరుగుతుందని తెలిసినా.. మంచి ముహూర్తం అంటూ సిజేరియన్ చేయించేశారు.



ఇలాంటివి ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కోకొల్లలుగా సాగుతున్నాయి. సుమూహూర్తాలు.. శుభ ఘడియలు.. నక్షత్రాలు.. తిథులు పేరిట యథేచ్ఛగా కడుపు కోతలు జరుగుతున్నాయి. ఉన్నతంగా చదువుకున్నవారు సైతం జననాలకు జాతకాలను ముడిపెడుతున్నారు. తల్లి గర్భం నుంచి దైవేచ్ఛతో.. స్వేచ్ఛగా ఇలలోకి రావాల్సిన బిడ్డలను మంచి ముహూర్తాల పిచ్చిలో ఆపరేషన్లు చేయించి మాతాశిశు ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. మనుషుల్లోని మూఢ నమ్మకాలను అలుసుగా తీసుకుని కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు అడ్డగోలు దోపిడీకి తెరతీస్తున్నారు.

ప్రసవానికి ఆ‘పరేషాన్’!

- మూహూర్తాల మోజులో తల్లిదండ్రులు
- కానుల కోసం తెగబడుతున్న ప్రైవేటు ఆస్పత్రులు
- గర్భిణులకు తప్పని కడుపు ‘కోత’లు
- రోజురోజుకూ పెరుగుతున్న సిజేరియన్లు
- నార్మల్ డెలివరీనే శ్రేయస్కరమంటున్న వైద్యనిపుణులు

చిత్తూరు రూరల్ : బిడ్డకు జన్మనివ్వడానికి మంచి రోజు, నక్షత్రం, ముహూర్తం చూసుకుంటున్న వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగిపోయింది. చాలా మంది దంపతులు, వారి కుటుంబీకులు పురోహితుల వద్దకు వెళ్లి డెలివరీకి ముహూర్తాలు చూసుకుంటున్నారు. ఫలానా రోజు... ఫలానా సమయం బాగుందని నిర్ణయించిన తర్వాత డాక్టర్లను కలిసి అదే సమయానికి ఆపరేషన్ చేయాలని కోరుతున్నారు. సుఖ ప్రసవానికి ఆస్కారం ఉన్నా.. సిజేరియన్ వైపే మొగ్గుచూపుతున్నారు. దీంతో వైద్యులు సైతం అసలు డెలివరీ కావాల్సిన సమయానికి ముందుగానే ఆపరేషన్ చేసేసి బిడ్డను చేతిలో పెడుతున్నారు.

కత్తెర పెడితే కలెక్షన్!

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా చేయడం లేదు. నార్మల్ డెలివరీ చేస్తే తక్కువ ఫీజు వస్తుందని, సిజేరియన్ అయితే ఎక్కువ సొమ్ము వసూలు చేయవచ్చని కొందరు వైద్యులు ఆపరేషన్‌కే మొగ్గుచూపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గర్భిణుల కుటుంబీకులు సైతం ఆస్పత్రి స్థాయి మేరకు ప్రసవానికి రూ.50 వేల నుంచి 60 వేల వరకు ప్యాకేజీలు మాట్లాడుకుని చేర్పిస్తున్నారు. అలాగే ముహూర్తం ఫిక్స్ చేసుకుని ఆ సమయానికి సిజేరియన్ చేయాల్సి వస్తే ఆస్పత్రుల వారు అదనంగా రూ. 30వేలు వసూలు చేస్తున్నారు. అనవసర ఆపరేషన్ల వల్ల తల్లీబిడ్డలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయిన తెలిసినప్పటికీ కొందరు ముహూర్తాల మోజులో సిజేరియన్‌కే ఆసక్తి చూపుతున్నారు. ఓ వైపు మూఢనమ్మకాలు, మరో వైపు ప్రైవేట్ ఆస్పత్రుల కాసుల కక్కుర్తి వల్ల సిజేరియన్‌ల సంఖ్యల రోజురోజుకూ అధికమవుతోంది.

అనవసరంగా ఆపరేషన్ చేస్తే..

- అవసరం లేకపోయినా ఆపరేషన్ చేస్తే తల్లీబిడ్డ ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుంది. శస్త్రచికిత్సకు కేవలం గంట సమయమే అయినా భవిష్యత్‌లో తల్లి అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.
- ఆపరేషన్ సమయంలో శరీరంలోని నాలుగైదు లేయర్లు కోయాల్సి ఉంటుంది. అప్పుడే గర్భాశయం నుంచి బిడ్డను బయటకు తీయగలరు. అప్పుడు తీవ్రంగా రక్తస్రావం అవుతుంది. డెలివరీ తర్వాత కనీసం 3నెలలపాటు తల్లికి విశ్రాంతి అవసరమవుతుంది. అత్యంత అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. తగిన పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా హెర్నియా, కడుపునొప్పి, వెన్ను నొప్పు వంటి సమస్యలు వస్తాయి.
- సిజేరియన్ వల్ల పుట్టిన బిడ్డ ఎదుగుదలతో లోపాలు తలెత్తుతాయి. ఊపిరితిత్తుల సమస్యలు అధికంగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

సిజేరియన్ చేయాల్సిన సందర్భాలు ఇవీ..



గర్భిణులకు చికిత్స చేస్తున్న వైద్యురాలు

- బిడ్డ ఎదురుకాళ్లతో ఉంటే సిజేరియష్ చేయాల్సి వస్తుంది.
- శిశువు బయటకు వచ్చే దారి చాలా సన్నగా (కాంట్రాక్టెడ్ పెల్విస్) ఉంటే మాత్రం ఆపరేషన్ తప్పనిసరి. సాధారణంగా తల్లుల ఎత్తు 135 సెం.మీ. కంటే తక్కువ ఉన్నవారికి బిడ్డ బయటకు వచ్చే దారి సన్నగా ఉండే అవకాశం ఎక్కువ.
- కడుపులోని శిశువు బరువు పెరగడం, బిడ్డ అడ్డం తిరగడం, ప్లసంటాపై భాగంలో ఉన్నప్పుడు, ఉమ్మనీరు తక్కువ ఉన్నప్పుడు, బిడ్డ ఉమ్మనీరు తాగినప్పుడు, తల్లికి బీపీ, షుగర్ అధికంగా ఉన్నప్పుడు, కవలలు, ముగ్గురు పిల్లలు జన్మించే సమయంలో సిజేరియన్ చేయాల్సిందే.

సాధారణ కాన్పు క్షేమం



- సాధారణ కాన్పులు తల్లీబిడ్డకు క్షేమకరం. నాలుగైదు గంటలు పురిటి నొప్పులు భరించాల్సి వచ్చినా.. భవిష్యత్తులో చాలా ఇబ్బందులు తప్పుతాయి.
- నార్మల్ డెలివరీ వల్ల రక్తస్రావం తక్కువ.
- తొలిసారి సహజ ప్రసవం అయితే రెండోసారి కూడా సుఖ ప్రసవం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- కాన్పు జరిగిన మూడు నాలుగు రోజుల నుంచే తల్లి అన్ని పనులు చేసుకునే వీలుంటుంది. బిడ్డ పుట్టిన గంటలోగా ముర్రుపాలు తాగించే అవకాశముంటుంది.
- శిశువుకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది
- వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువ. పుట్టే పిల్లల్లో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయి. అందుకే పాత కాలంలో సహజ ప్రసవాలవైపే మొగ్గుచూపేవారు.

చిత్తూరు జిల్లాలోని ప్రసవాల సమాచారం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో

నెల	సుఖ ప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
జనవరి	920	370	1,290
ఫిబ్రవరి	835	378	1,213
మార్చి	814	435	1,249
ఏప్రిల్	910	420	1,330
మే	922	450	1,372

ప్రైవేటు ఆస్పత్రుల్లో

నెల	సుఖ ప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
జనవరి	583	572	1,155
ఫ్రిబవరి	467	531	998
మార్చి	513	498	1,011
ఏప్రిల్	517	520	1,037
మే	492	537	1,029

తిరుపతి జిల్లాలోని ప్రసవాల సమాచారం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో

నెల	సుఖ ప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
జనవరి	849	375	1,224
ఫ్రిబవరి	794	365	1,159
మార్చి	922	442	1,364
ఏప్రిల్	783	341	1,124
మే	900	422	1,322

ప్రైవేటు ఆస్పత్రుల్లో

నెల	సుఖ ప్రసవాలు	సిజేరియన్లు	మొత్తం
జనవరి	617	814	1,431
ఫ్రిబవరి	550	655	1,205
మార్చి	630	739	1,369
ఏప్రిల్	448	565	1,104
మే	657	833	1,490



చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో క్యూలో వేచి ఉన్న గర్భిణులు

ఒత్తిడితో సిజేరియన్ వద్దు



ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవాలనే ప్రోత్సాహిస్తున్నాం. తప్పని పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేస్తున్నాం. అందుకు కారణాలను తల్లితో పాటు వారి కుటుంబ సభ్యులకు వివరిస్తున్నాం. ముఖ్యంగా ముహూర్తాలతో పేరుతో ప్రసవాలు వద్దు. ఆపరేషన్ చేయిస్తే దాని వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. అలా చేస్తే ఆ తల్లి జీవితాంతం ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– ఉషశ్రీ, గైనకాలజిస్ట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి, చిత్తూరు

ఆపరేషన్లను ప్రోత్సహిస్తే చర్యలు



సుఖ ప్రసవం చేస్తే బిడ్డతో పాటు తల్లికి కూడా మంచిది. సిజేరియన్‌ల సంఖ్యను వీలైనంత వరకు తగ్గించాలనే ప్రయత్నిస్తున్నాం. ఆపరేషన్ల వల్లే కలిగే నష్టాలపై గర్భిణులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. మంచి సమయం పేరుతో సిజేరియన్ చేయించడం మంచిది కాదు. ఆపరేషన్లను ప్రోత్సహిస్తే ఆయా ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రవిరాజు, డీఐఓ, చిత్తూరు

ప్రకృతి విరుద్ధం



సకల జీవకోటిలో మనిషి జన్మ ఉత్తమమైంది. అయితే శుభగడియలను మనమే నిర్ణయించుకుని పిల్లలను కనడం ప్రకృతి విరుద్ధం. భగవత్ సంకల్ప మేరకే జన్మలగ్నం నిర్ధారించబడి ఉంటుంది. అటుపై జాతకం, దాని ఫలం తెలుస్తుంది. అంతేకానీ, బలవంతంగా శస్త్రచికిత్స ద్వారా పుట్టిన పిల్లల జాతక ఫలాల్లో కచ్చితంగా తేడా ఉంటుంది. సంకల్పిత శస్త్రచికిత్స ద్వారా సంతానం పొందడం, తద్వారా ఉత్తమ భోగభాగ్యాలు లభిస్తాయనుకోవడం శాస్త్ర సమ్మతం కాదు. – సుధాకర్ గురుక్కల్, వేదపండితుడు, చిత్తూరు

మేతపోరంబోకులో.. టీడీపీ గద్దలు

- భారీ ఎత్తున భూ ఆక్రమణలు
- బాలాయపల్లిలో వెలుగుచూస్తున్న టీడీపీ నేతల బండారం
- రూ.లక్షకు రెండెకరాల చొప్పున సొమ్ముచేసుకున్న వైనం
- విలువైన భూములన్నీ బాబు బంధువుల చేతుల్లోనే
- ఎటువంటి రికార్డులు లేకుండానే దర్జాగా సాగు



- నా పేరు దానం మంజుల. మాకు గతంలో ప్రభుత్వం భూములు ఇచ్చింది. భూములకు సంబంధించి పత్రాలు కూడా ఇచ్చింది. అయితే ఇక్కడ ఇచ్చిన భూముల్లోకి మమ్మల్ని వెళ్లనివ్వడం లేదు. ఈ విషయం చాలా సార్లు అధికారులకు చెప్పాం. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు.



- నా పేరు వెంకటమ్మ. మా ఊరు నిండలి. మాకు గతంలో ప్రభుత్వం భూమి ఇచ్చింది. కాగితాలు కూడా ఉన్నాయి. అయినా ఏం లాభం అయ్యా. ఆ పొలంలోకి మమ్మల్ని పోనీలేదు. వారిని అడిగేవారే లేరా? మాకు న్యాయం చేయండి.

సాక్షి, తిరుపతి: టీడీపీ నేతలు నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోట్లాది రూపాయల విలువచేసే మేత పోరంబోకు భూములను ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. చంద్రబాబు బంధువులమని చెప్పుకుంటూ ఆ భూముల్లో దళితులు, పేదలను అడుగుపెట్టనివ్వకుండా అడుగడుగునా అడ్డుకుంటున్నారు. పెత్తందారుల దౌర్జన్యాలు అధికం కావడంతో స్థానికులు కొందరు మీడియాను ఆశ్రయించారు. వారి సమాచారం మేరకు.. వెంకటగిరి నియోజకవర్గం, బాలాయపల్లి మండల పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ, మేత, చెరువు, కాలువ పోరంబోకు భూములు ఉన్నాయి. విషయం తెలుసుకున్న చంద్రబాబునాయుడు నాడు ఇదే మండలంలోని నిండలి గ్రామంలో సుమారు 320 ఎకరాల భూములను అతితక్కువ ధరకు కొనుగోలు చేశారు. ఈ భూములను ఎకరం రూ.వెయ్యి, రూ.2వేల లోపు వెచ్చించి కొనుగోలు చేశారు. చంద్రబాబు ఆస్తుల చిట్టా బయటపడటంతో ఆ భూములన్నీ బంధువుల పేరున మార్చేశారు. అందులో 18 ఎకరాల అసైన్డ్ భూములను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గిరిజనులకు పంపిణీ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ 18 ఎకరాలను రద్దుచేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంపిణీ చేశారు. ఆపై ఆ భూములు అనుభవించేది మాత్రం బాబు బంధువులే. లబ్ధిదారులను ఆ భూముల్లోకి అడుగుపెట్టనివ్వడం లేదు.

చర్యలు తీసుకుంటాం

బాలాయపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ, మేత, వాగు, చెరువు పోరంబోకు భూములు ఉన్నమాట వాస్తవమే. ఆయా గ్రామాల్లో నేరుగా వెళ్లి పరిశీలించి, ఆక్రమించుకుని ఉంటే.. చర్యలు తీసుకుంటాం. దళితుల భూములు ఎవరైనా ఆక్రమించుకుని, వారి భూముల్లోకి అనుమతించకుండా ఉంటే విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-కిరణ్‌కుమార్, ఆర్డీఓ, గూడూరు డివిజన్.

విచ్చలవిడిగా ఆక్రమణలు

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బాలాయపల్లి మండల పరిధిలోని వాక్యం, నిండలి పరిధిలోని మేత పోరంబోకు, వాగు పోరంబోకు భూములు మరో 320 ఎకరాలకుపైగా ఆక్రమణకు గురయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉన్న ఈ మండలంలో కొందరు చంద్రబాబు బంధువులదే పెత్తనం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారు చెప్పిందే వేదం. నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు రూ.లక్షకు రెండెకరాలు అని బేరం పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. సదరు భూములు కొనుగోలు చేసుకున్న టీడీపీ నేతలు అందులో దర్జాగా నిమ్మ సాగు చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా పంట ఉత్పత్తులను అమ్మి జేబులు నింపుకుంటున్నారు. మరికొందరు ఎకరం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల చొప్పున అమ్ముకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ భూముల వద్దకు ఎవరైనా వెళ్లి ఫొటోలు తీసే ప్రయత్నం చేసినా.. వారిపై దాడులకు తెగబడుతున్నారు.

నోరెత్తరంతే!

బాలాయపల్లి మండల పరిధిలో భూములు ఆక్రమణకు గురయ్యాయని తెలిసినా.. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడరు. గట్టిగా అడిగితే.. వారికి అసైన్డ్‌మెంట్ పట్టాలు ఉన్నాయని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వసూళ్లు చేసిన మొత్తాన్ని టీడీపీ నేతలు, కొందరు అధికారులు పంచుకున్నట్లు తెలుస్తోంది. ఖాళీగా ఉన్న భూముల్లోకి ఎవరైనా దళితులు, గిరిజనులు, పేదలు అడుగుపెడితే వారిపై దాడులకు తెగబడుతున్నట్లు బాధితులు ఆవేదన చెందుతున్నారు.



నిండలిలో దళితులకు పంపిణీ చేసిన భూములు



వాక్యం గ్రామంలో దర్జాగా ఆక్రమించుకుని నిమ్మ సాగు చేసుకుంటున్న దృశ్యం

మెరుగైన ఆరోగ్యమే లక్ష్యం



బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి మండలం, పనపాకం పంచాయతీలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, మెరుగైన ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పనపాకం హైస్కూల్, అరిగిలవారిపల్లి ప్రాథమిక పాఠశాల, రవణప్ప గారిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. వైద్య పరీక్షలు చేసుకునేందుకు విచ్చేసిన ప్రజలకు ఉచితంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన సదుపాయాలను కల్పించారు. నియోజకవర్గంలో ప్రజలు ఆరోగ్యకర జీవితాన్ని అనుభవించాలనే ఆకాంక్షతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు ఓపికగా వైద్య పరీక్షలు చేయాలని సూచించారు.

శ్రీకాళహస్తీశ్వర జలప్రసాదం ప్రారంభం



భక్తులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితో కలిసి జలప్రసాదాన్ని అందిస్తున్న సినీనటుడు జేడీ చక్రవర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఐదు ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ప్రముఖ సినీనటుడు జేడీ చక్రవర్తి చేతులమీదుగా శ్రీకాళహస్తీశ్వర జలప్రసాదాన్ని ప్రారంభించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల దాహార్తి తీర్చేవిధంగా దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో వాటిని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ భక్తుల కోసం దాహార్తిని తీర్చేందుకు వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తుల దాహార్తిని తీర్చేందుకు హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ వారిని సంప్రదించగా స్పందించి సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తీశ్వర జలప్రసాదం

తలనీలాల బహిరంగ వేలం

పాకాల: ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీవళ్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు ఈ నెల 23వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేలంపాట పాడదలచిన వారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

క్లుప్తంగా

328 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత


కలగుంట ప్రాంతంలో పట్టుబడిన రేషన్ బియ్యం

దొరవారిసత్రం: కలగుంట–నేలపట్టు గ్రామాల మధ్య అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 328 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య మంగళవారం పోలీసులతో వెళ్లి పట్టుకున్నారు. డీటీ కథనం.. పల్లెల్లో అక్రమంగా కొనుగోలు చేసి నెల్లూరుకు వాహనాల్లో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో స్థలానికి వెళ్లిన అధికారులు రేషన్ బియ్యంతో పాటు మూడు వాహనాలు, 8 మంది కూలీలు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ బియ్యం విలువ రూ.2,78,800 ఉంటుందన్నారు.

ఎస్జీటీల యాంటిసిడెంట్ జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 23 మంది ఎస్జీటీల యాంటిసిడెంట్ జాబితాను డీఈఓ విజయేంద్రరావు మంగళవారం విడుదల చేశారు. ఈ మేరకు కుప్పం, తవణంపల్లె, గుడిపాల, బంగారుపాళ్యం, గుడుపల్లె, ఏర్పేడు, రామకుప్పం, చిత్తూరు ఎంఈఓలకు పంపించారు.

సమస్యలు పరిష్కరిస్తూ..సంక్షేమాన్ని వివరిస్తూ..!


అశేష జనం మధ్య సాగుతున్న గడప గడపకు మహాపాదయాత్ర


ఆదినపల్లి యువకులతో క్రికెట్ ఆడుతున్న మోహిత్‌రెడ్డి

- ప్రజాసమస్యల పరిష్కారానికే పాదయాత్ర
- ప్రజాసేవలో తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు
- ఆదినపల్లి, లింగనపల్లి పంచాయతీల అభివృద్ధికి రూ.14.4 కోట్లు

పాకాల: ఇప్పటికీ అక్కడక్కడా మిగిలిపోయిన సమస్యలను, ప్రజల అవసరాలను తెలుసుకునేందుకు చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన గడపగడపకు మహాపాదయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. పాకాల మండలంలోని ఆదినపల్లి, లింగనపల్లె పంచాయతీల్లో మంగళవారం పాదయాత్ర సాగించగా.. అక్కడి ప్రజలు ఆప్యాయంగా అక్కున చేర్చుకుని అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి సమస్యలపై ఆరాతీవారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు.

రుణం తీర్చుకుంటాం

కరోనా కాలంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తమకు దేవుడిలాగా అండగా నిలిచారని, లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడుతున్న తరుణంలో తమకు కూరగాయలు, పండ్లు, సిరప్పులు, ట్యాబ్లెట్లు, కోడి గుడ్లు పంపారని స్థానికులు గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యే రుణం తీర్చుకునే సమయం వచ్చిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు.

నేంద్రగుంటలో అపూర్వ స్వాగతం

ఆదినపల్లి పంచాయతీలోని నేంద్రగుంట గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలు మోహిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. బాణసంచా పేల్చి మంగళవాయిద్యాలతో ఘనంగా స్వాగతించారు. అంతకముసుపు గాదంకి పంచాయతీ పరిధిలోని మిట్టగాదంకి, కొత్తూరు, కొత్తూరు హరిజన వాడల్లో పర్యటించిన మోహిత్‌రెడ్డి స్థానిక సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం రేషన్‌కార్డు, పింఛన్, ఇళ్ల మంజూరు తదితర సమస్యలు కొన్ని అక్కడికక్కడే పరిష్కరింపజేశారు. ప్రతీ గ్రామంలో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంక్షేమ పథకాల జాబితాల బుక్‌లెట్లను అందజేశారు. జగనన్నని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని మోహిత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఆదినపల్లి, లింగనపల్లి పంచాయతీల అభివృద్ధికి రూ.14.4 కోట్లు

ఆదినపల్లి, లింగనపల్లి గ్రామ పంచాయతీల్లో రూ.14.4 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు మోహిత్‌రెడ్డి వెల్లడించారు. ప్రతీ పల్లెలో సీసీ రోడ్లు, సచివాలయ భవనం, నాడు–నేడు కింద పాఠశాలల్లో ఆధునీకరణ, తుడా నిధులతో యోగా ధ్యాన మందిరం, ఆర్వో వాటర్‌ప్లాంట్, శ్మశాన వాటికలో సదుపాయాల కల్పన, సిమెంట్ బెంచీల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు.

లైంగికదాడిపై పోక్సో కేసు

చిత్తూరు అర్బన్: నగరంలోని ఓ మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు మంగళవారం టూటౌన్ పోలీసులు తెలిపారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు.. 15 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి గిడ్డుబాయ్ అనే వ్యక్తి నాలుగు నెలలుగా లైంగికదాడికి పాల్పడుతున్నాడు. బాలిక గర్భం దాల్చడంతో కుటుంసభ్యులకు విషయం తెలిసింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,230
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,499
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,400
రిటైల్ వెండి గ్రాము	రూ.76.40

పెళ్లి దుస్తులు కొనుగోలు చేసి తిరిగి వస్తూ..

- కుక్కను తప్పించబోయి కారు బోల్తా
- ఒకరి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

రాపూరు: రాపూరు–పెంచలకోన జాతీయ రహదారిలో సోమవారం అర్ధరాత్రి కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతిచెందగా.. ఐదుగురికి తీవ్రగాయాలైన ఘటన నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, ఓబులాయిపల్లి గ్రామ సమీపాన చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. నిజామాబాద్‌కు చెందిన కుటుంబ సభ్యులు కారులో కంచికి వెళ్లి పెళ్లిబట్టలు కొనుగోలు చేశారు. ఆపై తిరుగుప్రయాణంలో ఓబులాయిపల్లె సమీపంలో కారుకు అడ్డంగా కుక్క అడ్డురావడంతో దాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కనున్న గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కొల్లూరు భూలక్ష్మి (43) అక్కడికక్కడే మృతి చెందగా.. పెళ్లి కూతురు తల్లి కందూరు రవణమ్మ, పెళ్లికూతురు రవళి, అన్న సునీల్‌కుమార్, బంధువు రాజ్యలక్ష్మి, కొల్లూరు మహిమచౌదరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


భూలక్ష్మిని కారులో నుంచి రోడ్డుపైకి తీసుకు వస్తున్న పోలీసులు(ఇన్‌సెట్) మృతురాలు భూలక్ష్మి

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో జిల్లా పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం కలెక్టర్ షణ్మోహన్ గుడిపాల మండలం చీలాపల్లె సీఎంసీ ప్రాంగణంలో హెలీప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించారు. మెడికల్ కాలేజీకి ముఖ్యమంత్రి భూమిపూజ చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వరరెడ్డి, తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులపై కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: తిరుమలలో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా నివాసం ఉంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం తిరుమల, తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో ఆయన పోలీస్ అతిథి గృహంలో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై ఉక్కు పాదం మోపాలన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులు నకిలీ వెబ్‌సైట్ల బారినపడకుండా చూడాలన్నారు. అదేవిధంగా భక్తులు కూడా టీటీడీ యాప్‌లనే నమ్మాలని సూచించారు. సంప్రదాయ పోలీస్ ఇన్ అమలులో భాగంగా వేగు వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. ఆస్తి నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నియంత్రించాలని తెలిపారు. అదేవిధంగా ప్రజల్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవల గురించి ఇంకా మెరుగైన అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గంజాయిని అరికట్టడమే ప్రధాన లక్ష్యమన్నారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల్‌కుమారి, మునిరామయ్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

పానగల్ గంగమ్మకు ముక్కంటి సారె


గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి, ఆలయ చైర్మన్ అంజూరు, బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పానగల్ గంగ జాతర సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున ముక్కంటి సారె సమర్పించారు. ఆలయ అలంకార మండపం వద్ద సారెకు పూజల అనంతరం పానగల్‌లోని పొన్నాలమ్మ ఆలయం వద్దకు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులకు సారె సమర్పించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బియ్యపు ఆకర్ష్‌రెడ్డి పాల్గొన్నారు.

అరెస్ట్ వారెంట్ అమలు

తిరుపతి లీగల్: కోర్టుకు హాజరుకాకుండా ఏడాదిగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడ్ని ఎంఆర్ పల్లి పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు కానిస్టేబుల్ ఫణీంద్ర తెలిపిన వివరాల మేరకు.. 2014 ఆగస్టు 20వ తేదీ ఓ వ్యక్తి తన కుమార్తెను తీసుకొని తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా ఆర్‌సీ.పురం మండలం, గణేష్ పురానికి చెందిన ఏనుగుల శివ, శాకమూరి కండ్రిగకు చెందిన కె.రమేష్ ఓ షేర్ ఆటో తీసుకువచ్చి ఆ ఇద్దర్నీ పేరూరుకు తీసుకెళతామంటూ మాయమాటలు చెప్పారు. ఆపై రేణిగుంట–చంద్రగిరి 150 బైపాస్ రోడ్డు రామానుజపల్లి సర్కిల్ సమీపంలోని పొదల వద్దకు ఆటోను తీసుకెళ్లారు. తర్వాత ఇద్దరిపై దాడిచేసి వారి వద్ద ఉన్న బంగారు నగలను దోచుకుని ఆటోలో పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎంఆర్.పల్లి పోలీసులు ఇద్దరిపై కేసునమోదుచేసి తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ దశలో మొదటి నిందితుడు ఏనుగుల శివ మృతిచెందాడు. రెండో నిందితుడు కె.రమేష్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి ఏడాది జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ గత ఏడాది తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై పైకోర్టుకు అప్పీలుకు వెళతానంటూ కోర్టు అనుమతి తీసుకున్నాడు. అయితే అతను అప్పీలుకు వెళ్లక, కోర్టుకూ హాజరుకాక పోవడంతో నిందితుడు రమేష్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరచాలని ఇదివరలో న్యాయమూర్తి అరెస్ట్‌వారెంట్‌ను జారీచేశారు. దీనిపై ఎంఆర్.పల్లి పోలీస్ స్టేషన్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి, సిబ్బంది నిందితుడు రమేష్‌ను అదుపులోకి తీసుకొని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి అతడ్ని సబ్‌జైలుకు తరలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భక్తుల సౌకర్యాలకు భూకేటాయింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం 18.60 ఎకరాలను కేటాయించినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ తవణంపల్లె మండలం కె.పట్నం వద్ద సర్వే నెంబర్ 772–19లో 8.16 ఎకరాలు , 772–1లో 10.44 ఎకరాలను ఆలయ తరఫున స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు భూమిలో భక్తుల సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

హత్య కేసులో ముద్దాయికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్ : హత్యకేసులో పుత్తూరు బలిజవీధికి చెందిన కావడి బాబు అలియాస్ సైకోబాబుకు ఐదు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా మంగళవారం తీర్పుచెప్పారు. కోర్టు మానిటరింగ్ అధికారి ఈశ్వరయ్య తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన మతిరెడ్డి అలియాస్ మహాలక్ష్మీరెడ్డి ఇంట్లో వారితో తగువుపడి ఇంటిని వదలి రేణిగుంటకు వచ్చాడు. రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలోని కార్ పార్కింగ్, రైల్వేస్టేషన్ వద్ద కార్ల అద్దాలను శుభ్రం చేస్తూ వచ్చిన డబ్బుతో రైల్వేస్టేషన్ వద్ద జీవించేవాడు. అలాగే అతను మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. నిందితుడు బాబు కూడా రైల్వేస్టేషన్ కార్‌పార్కింగ్ వద్ద కారు అద్దాలను శుభ్రం చేసేవాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవించి తరచూ తగువు పడేవారు. దీంతో మహాలక్ష్మీరెడ్డిని ఎలాగైనా అంతమొందించాలని బాబు కక్ష గట్టాడు. 2022 మే 24వ తేదీ అర్ధరాత్రి బాబు రైల్వేస్టేషన్ సమీపంలోని సులభ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆటోస్టాండ్ సమీపంలో మహాలక్ష్మీరెడ్డిని మద్యం, బీడీలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అతను ఇవ్వకపోవడంతో దుర్భాషలాడాడు. ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సులభ కాంప్లెక్స్ సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద ఉన్న ఓ సిమెంట్ ప్లేట్‌ను తీసుకొని మహాలక్ష్మీరెడ్డి మొహంపై దాడిచేశాడు. దీంతో మహాలక్ష్మీరెడ్డి తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే కుప్పకూలాడు. వెంటనే బాబు అతడ్ని రైల్వేస్టేషన్ కార్‌పార్కింగ్ వద్దకు తీసుకువచ్చి అక్కడ వదలి పరారయ్యాడు. 2022 మే 25వ తేదీ ఉదయం 6.30 గంటల ప్రాంతంలో అక్కడికి వచ్చిన ఆటో డ్రైవర్లు రక్తపుమడుగులో పడిఉన్న మహాలక్ష్మీ రెడ్డిని 108 వాహనంలో రుయా ఆస్పత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న రేణిగుంట అప్పటి వీఆర్‌వో కే.యూన్సీరాణి రేణిగుంట పోలీసులకు ఫిర్యాదుచేశారు. రేణిగుంట సీఐలు అంజూయాదవ్ కేసు దర్యాప్తుచేయగా సీఐ పీసీవీ.సుబ్బారెడ్డి కేసు దర్యాప్తుచేశారు. నిందితుడు బాబును అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు బాబుకు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. సంఘటన జరిగిన ఏడాదిలోనే కేసు విచారణ జరిగి నిందితుడికి శిక్ష పడడం విశేషం.

రాపూరులో మూడోరోజు లోకేశ్ పాదయాత్ర


రాపూరులో పాదయాత్ర చేస్తున్న నారా లోకేశ్

రాపూరు/డక్కిలి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాపూరు మండలంలో మూడోరోజు కొనసాగింది. మంగళవారం రాపూరు శివార్ల నుంచి రాపూరు, మద్దెల మడుగు, మసీపేట, సిద్ధవరం గ్రామాలు మీదుగా కొనసాగింది. పాదయాత్రలో పలువురి ప్రజలను కలుసుకుంటూ లోకేష్ ముందుకు సాగారు. ఈ సందర్భంగా పలు గ్రామస్తులు సమస్యలపై అర్జీలు అందజేశారు. లోకేష్ పాదయాత్ర మంగళవారం రాత్రి డక్కిలి మండలం మాధవయ్యపాళెంకు చేరుకుంది. మాధవయ్యపాళెం రోడ్డు సెంటరు, వెలికల్లు, వెలికల్లు దళితవాడ, మార్లగుంట గ్రామాల్లో రోడ్డు మీద పలువురితో మాటామంతి కార్యక్రమం జరిగింది. అనంతరం డక్కిలి దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటరులో ఏర్పాటు చేసి ఉన్న శిబిరం వద్ద పాదయాత్ర ముగిసింది.

సందిట్లో సడేమియా..

నారా లోకేశ్ పాదయాత్రలో పలువురు జేబుదొంగలు తమ పనితనాన్ని చూపారు. పలువురి జేబులోని నగదు, సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. నగదు పోగొట్టుకున్న వారు లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీశారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్

– ఇద్దరికి తీవ్రగాయాలు

యాదమరి: మండలంలోని చిన్నిరెడ్డిపల్లె క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. దాసరాపల్లె దళితవాడకు చెందిన సుందర్‌రాజ్(34), సురేష్‌కుమార్(46) చిత్తూరులో ఎలక్ట్రికల్ దుకాణం నడుపుతున్నారు. వీరు బైక్‌పై దుకాణం వద్దకు బయదేరారు. అదే సమయంలో చిత్తూరు వైపు నుంచి పరదరామి వైపు వెళుతున్న పాల వ్యాన్ ఓ లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో సుందర్‌రాజ్, సురేష్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వేలూరు సీఎంసీకి తరలించారు. ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

రిజిస్ట్రేషన్లపై శిక్షణ

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్ సేవలకు జిల్లాలోని 104 సచివాలయాలు ఎంపిక చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులకు సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 6 నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈసీ, మార్కెట్ విలువ, ఈకేవైసీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించనున్నారు.